## పెద్దమ్మ తల్లికి పోటెత్తిన భక్తజన సందోహం



2 లో..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రూరల్ ఆగస్ట్ 23(విజన్ ఆంధ్ర ప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలోని కేశవాపురం-జగన్నాథపురం గ్రామాల మధ్య వెలిసియున్న శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానం(పెద్దమ్మ గుడి) నందు ఆదివారం పురస్కరిం చుకొని అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేయడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిలాడింది ఉదయం నుండే పరిసర గ్రామాల నుండి కాక జిల్లా నలుమూల నుండే కాక ఇతర జిల్లాల నుండే కాక సరిహద్దు నున్న ఆంధ్రప్రదేశ్ నుండి కూడా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసినారు. తమను చల్లగా చూడాలని, వానలు బాగా పడాలని తమ



ESTD : 1999

# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

# ఉమ్మడి ఖమ్మం జిల్లా

సోమవారం 24 ఆగష్టు 2026 పేజిలు : 10

## భక్తిశ్రద్ధలతో తీజ్ వేడుకలు

◆ భాగ్యనగర్ తండాలో ఘనంగా తీజ్ నిమజ్జన వేడుక



**కారేపల్లి,ఆగస్టు 23 (విజన్ ఆంధ్ర)** బంజారా సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ తీజ్ అని భాగ్యనగర్ తండా సర్పంచ్ హిరాలాల్ అన్నారు.తీజ్ పండుగ సందర్భంగా గ్రామంలో డీజే లను ఏర్పాటు చేసి బంజారా సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా తొమ్మిది రోజులుగా యువతులు భక్తిశ్రద్ధలతో తీజ్ పూజలు నిర్వహించి ఆదివారం నిమజ్జన కార్య క్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా దేవతలకు నైవేద్యాలు సమర్పించి, బంజారా సంప్రదాయ నృత్యాలతో సందడి చేశారు. ప్రకృతిని, పంటలను, పశుసంపదను గౌరవించే బంజారా సమాజంలో తీజ్ పండుగకు విశిష్ట స్థానం ఉందని సర్పంచ్ బానోత్ హీరాలాల్ అన్నారు.తీజ్ పండుగ ప్రజలం దరినీ ఒక్కచోట చేర్చి ఐక్యతను చాటుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పూజారి మంగ్తు సేవాలాల్ కాంగ్రెస్ జిల్లా నాయకులు గుగులోత్ భీముడు నాయక్,రాందాస్నాయక్,లకావత్దామ్లా,భగవాన్దాస్,బానోత్ రాంచందర్, మంగీలాల్, లావుడ్యా ఈర్య,భూక్యా తారాచంద్ గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలపై దాడి..

◆ లేబర్ కోడ్‌లపై ఏఐటీయూసీ పోరు బాట




2 లో..

**సత్తుపల్లి ఆగస్టు 23, (విజన్ ఆంధ్ర)** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్మికులకు రక్షణగా ఉన్న 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ విమర్శించారు. ఖమ్మం జిల్లా 17వ మహాసభల సందర్భంగా ఆదివారం లక్ష్మీ ప్రసన్న ఫంక్షన్ హాల్లో జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సెమినార్ ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నరసింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహాసభల సందర్భంగా అంబేద్కర్ సెంటర్ నుండి మహాసభల ప్రాంగణం వరకు బారీ కార్మిక ప్రదర్శనను నిర్వహించారు. అనంతరం లక్ష్మి ప్రసన్నలో జరిగిన సదస్సులో నరసింహ మాట్లాడుతూ అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దాసోహం చేస్తుందని ఆరోపించారు. కార్పొరేట్ శక్తులకు అనుకూలమైన చట్టాలు తీసుకురావడంతో శ్రామికుల శ్రమ మరింత దోపిడికి గురవుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనధికారికంగా రోజుకి 10 నుండి 16 గంటలు పని చేయించుకుంటున్నారని, రేపు ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగిస్తే కార్మికుల జీవితాలు బుగ్గిపాలవుతాయని ఆవేదన వ్యక్తం

# పట్టభద్రుల బరిలో జనసేన జోరు..



2 లో..

● గడలే అభ్యర్థి పట్టభద్రుల ఓటే లక్ష్యం

● ఎమ్మెల్సీ సీటే టార్గెట్.. గడలతో జనసేన దూకుడు!

● శాసన మండలిలో పట్టభద్రుల స్వరం వినిపిస్తా గడల శ్రీనివాసరావు

కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 23(విజన్ ఆంధ్ర) ఖమ్మం-నల్లగొండ-వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జనసేన పార్టీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును పార్టీ ముందస్తుగా ప్రకటించింది. దీంతో మూడు ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో రాజకీయంగా ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది.డాక్టర్ గడల శ్రీనివాసరావు ప్రస్తుతం జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర నాయకుడిగా, అధికార ప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా జనసేన పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వైద్య, ఆరోగ్య శాఖలో ఉన్నతస్థాయిలో సేవలందించిన ఆయన తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్య రంగంలో విశేష సేవలు అందించారు. జనసేన పార్టీ జాతీయ కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ అధ్యక్షుడు శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో డాక్టర్ గడల శ్రీనివాసరావు అభ్యర్థిత్వంపై పార్టీ నాయకత్వం చర్చించినట్లు తెలిపారు. ఆయన పేరును పార్టీ జాతీయ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రతిపాదించగా, ఆయన అభ్యర్థిత్వానికి సుముఖత వ్యక్తం చేయడంతో ఉమ్మడి ఖమ్మం--నల్లగొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావును జనసేన పార్టీ ముందస్తుగా ప్రకటించినట్లు పేర్కొన్నారు.

**పట్టభద్రుల సమస్యలపై బలమైన పోరాటం**

పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, యువత, విద్యావంతులు, మేధావులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసన మండలి వేదికగా బలంగా వినిపిస్తానని డాక్టర్ గడల శ్రీనివాసరావు తెలిపారు. విద్య, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ సమస్య, యువత భవిష్యత్ వంటి అంశాలపై పట్టభద్రుల తరఫున తన వాణిని వినిపించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని

# కొత్తగూడెం ప్రజలకు గుడ్‌న్యూస్

## - త్వరలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం!

◆ 75 కిలోమీటర్ల ప్రయాణానికి చెక్..

◆ కొత్తగూడెం హెడ్ పోస్టాఫీసులోనే సేవలు

◆ కేంద్రానికి ప్రతిపాదనలు అధికారుల సానుకూల స్పందన

◆ ప్రత్యేక చొరవతో పాస్‌పోర్ట్ కేంద్రం ఏర్పాటుకు కృషి

◆ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 23(విజన్ ఆంధ్ర)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కొత్తగూడెం ప్రజలకు త్వరలో పాస్‌పోర్ట్ సేవలు అందు బాటులోకి రానున్నాయి. పట్టణంలోని హెడ్ పోస్టాఫీసులో పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు కొనసాగు తున్నాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు.కొత్తగూడెంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని తాను కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతో పాటు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి సమర్పించిన లేఖలు, చేసిన సంప్రదింపులపై అధికారులు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి అనుమతితో కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలోని పాస్‌పోర్ట్ సేవా ప్రాజెక్ట్ డివిజన్ అండర్ సెక్రటరీకి పరిశీలన నిమిత్తం ప్రతిపాదనలు పంపించినట్లు వివరించారు.

**75 కిలోమీటర్ల ప్రయాణానికి ఇక చెక్**



2 లో..

కొత్తగూడెం ప్రధాన పారిశ్రామిక, గనుల, వాణిజ్య కేంద్రంగా విస్తరించడంతో ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, నిరుద్యోగ యువత సంఖ్య గణనీయంగా ఉందని కూనంనేని తెలిపారు.ప్రస్తుతం పాస్‌పోర్ట్ సేవల కోసం కొత్తగూడెం ప్రాంత ప్రజలు సుమారు 75

# పట్టభద్రుల బరిలో జనసేన జోరు..

(మొదటి పేజీ తరువాయి..)

చెప్పారు. పట్టభద్రుల సమస్యలు కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే చర్చకు వచ్చే అంశాలుగా కాకుండా.. వాటిపై నిరంతరం ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా, ప్రజల తరపున బాధ్యతాయుతమైన ప్రతినిధిగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.

**మూడు జిల్లాల పట్టభద్రుల ఆశీస్సులు కోరిన గడల**

ఉమ్మడి ఖమ్మం--నల్లగొండ--వరంగల్ జిల్లాలకు చెందిన పట్టభద్రులు, ఉన్నత విద్యావంతులు, ఉద్యోగులు, యువత, మేధావులు తనకు ఆశీస్సులు, ఆదరణ అందించాలని డాక్టర్ గడల శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. తనపై నమ్మకం ఉంచి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించిన జనసేన పార్టీ జాతీయ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు, జాతీయ కార్యదర్శి రామ్ తాళ్లూరికి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్‌కు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**జనసేన సత్తా చాటుతాం**

ఉమ్మడి మూడు జిల్లాల పట్టభద్రుల మద్దతుతో ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకుని తెలంగాణలో జనసేన పార్టీ సత్తాను చాటుతామని డాక్టర్ గడల శ్రీనివాసరావు ధీమా వ్యక్తం చేశారు. పట్టభద్రుల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ.. వారి సమస్యలను శాసన మండలి వరకు తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. "పట్టభద్రుల గొంతుకగా.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం.. శాసన మండలిలో బలమైన స్వరం వినిపిస్తా" అని డాక్టర్ గడల శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టభద్రుల గొంతుకగా.. ప్రజా సమస్యల పరిష్కారం కోసం.. డాక్టర్ గడల శ్రీనివాసరావుకు మూడు జిల్లాల పట్టభద్రులు ఆశీస్సులు, ఆదరణ అందించాలని జనసేన పార్టీ విజ్ఞప్తి చేసింది

# కొత్తగూడెం ప్రజలకు గుడ్‌న్యూస్

(మొదటి పేజీ తరువాయి..)

కిలోమీటర్ల దూరంలోని ఖమ్మం, మహబూబాబాద్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోందని చెప్పారు. దీంతో పాస్‌పోర్ట్ దరఖాస్తు, ధ్రువీకరణ వంటి సేవల కోసం ప్రజలు సమయం, డబ్బు ఖర్చు చేసుకోవాల్సి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత దూరప్రాంతాలకు వెళ్లడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

**జిల్లా కేంద్రంలోనే సేవలు అందుబాటులోకి రావాలి**

జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం కొత్తగూడెం ప్రత్యేక జిల్లా కేంద్రంగా ఏర్పడిందని, జిల్లా కేంద్రానికి అనుగుణంగా ప్రజలకు అవసరమైన అన్ని రకాల ప్రభుత్వ సేవలు స్థానికంగానే అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. అందులో భాగంగానే కొత్తగూడెంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటు కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నామని చెప్పారు.

**హెడ్ పోస్టాఫీసులో పాస్‌పోర్ట్ సేవా ఏర్పాటు**

కొత్తగూడెం హెడ్ పోస్టాఫీసులో పోస్ట్ ఆఫీస్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు కూనంనేని తెలిపారు. సంబంధిత ప్రతిపాదనలు ఇప్పటికే కేంద్ర స్థాయికి చేరాయని, అధికారుల నుంచి సానుకూల స్పందన లభించిందని పేర్కొన్నారు. త్వరలోనే కేంద్రం నుంచి అధికారిక ఆదేశాలు వెలువడి పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ప్రజలకు అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**కొత్తగూడెంలో పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఏర్పాటైతే..**

75 కిలోమీటర్ల దూర ప్రయాణానికి తెరపడే అవకాశం

సమయం, ప్రయాణ ఖర్చులు ఆదా

విద్యార్థులు, ఉద్యోగులు, యువతకు ప్రయోజనం

వృద్ధులు, మహిళలకు సౌకర్యం

జిల్లా కేంద్రంలోనే పాస్‌పోర్ట్ సేవలు

"కొత్తగూడెం ప్రజలకు పాస్‌పోర్ట్ సేవలు స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యం. కేంద్ర మంత్రిత్వ శాఖ దృష్టికి సమస్యను తీసుకెళ్లి అనుమతుల కోసం ప్రత్యేకంగా కృషి



చేస్తున్నాం. త్వరలోనే అధికారిక ఆదేశాలు వెలువడుతాయని ఆశిస్తున్నాం" అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు.

# కార్మిక చట్టాలపై దాడి..

(మొదటి పేజీ తరువాయి..)

చేశారు. ఏ ప్రభుత్వాలు కార్మికులకు ఏ చట్టాన్ని దయతోనో వారి సంక్షేమం కొరకు ఇవ్వలేదని కార్మిక చట్టాలు కేవలం కార్మికులు దశాబ్దాల పోరాటాల ద్వారా సాధించిన హక్కులన్నారు. కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ విధానాల వల్ల ప్రస్తుతం సంఘటిత రంగంలో కూడా అసంఘటితరంగాన్ని తలపించేలా వేతనాలు ఉన్నాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉద్యోగ భద్రత, పని గంటలు, వేతనాలు, సామాజిక భద్రత వంటి అంశాలపై లేబర్ కోడ్‌లు ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు తాము కనీస వేతనాలు నెలకు రూ. 26వేలు ఇవ్వాలని పోరాటాలు చేస్తుంటే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేతనాలు తగ్గించడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకవైపు బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతూనే మరొకవైపు ఎనిమిది గంటల పని విధానాన్ని తొలగించి 10 గంటల పని విధానం తీసుకురావటం బాధాకరమైన విషయమని మండిపడ్డారు. సోమవారం జరిగే మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి,కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు, జాతీయ కౌన్సిల్ సభ్యులు బాగం హేమంతరావు, పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి షేక్.షాబీర్ పాషా, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొంటారని కావునా సిపిఐ పార్టీ నాయకులు,కార్యకర్తకు,సానుభూతిపరులు బారీగా హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగ్ నరసింహారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.జి. క్లెమెంట్ జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మీనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శివరామకృష్ణ, జిల్లా కార్యదర్శి టి. రామాంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, వేము రాంబాబు, మహాదేవ లక్ష్మి, జిల్లా కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ బి.కే.ఏం.యు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ సింగరేణి ఏఐటీయూసీ కార్యదర్శి సముద్రాల సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు తడికమళ్ల యోబు, రంజాన్ బీ, మున్సిపల్ నాయకులు ఊడల కృష్ణమూర్తి, వజీర్ మియా టి. లక్ష్మి, సత్తుపల్లి, సుధాకర్, కార్యదర్శి శ్రీనివాసరావు, మలైకా, ఏఐటీయూసీ మండల కార్యదర్శి రామారావు తెలగారపు, తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీను, నాయకులు శ్రీను,వెంకటేశ్వరరావు, వేంసూరు ఎండీఎం అధ్యక్షురాలు సత్యావతి, బుచ్చాలు పాల్గొన్నారు.




# పెద్దమ్మ తల్లికి పోటెత్తిన భక్తజన సందోహం

(మొదటి పేజీ తరువాయి..)

పంటలు బాగా పండాలని కోరుకుంటూ బోనాలు సమర్పించారు. మరియు అన్న ప్రాసనలు,వాహన పూజలు తలనీలాలు అమ్మవారికి ఒడిబియ్యం,చీరలు పసుపు కుంకుమలు తదితరు మొక్కు లను చెల్లించుకొని అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములను స్వీకరించారు. భక్తులకు అవసర మైన ప్రత్యేక దర్శనానికి క్యూ లైన్లు ఉచిత పులిహోర ప్రసాద వితరణ మంచినీటి వసతి తదితర ఏర్పాట్ల ను దేవస్థానం కార్య నిర్వహణ అధికారి ఎన్ రజని కుమారి పర్య వేక్షించారు.

# అంతర్జాతీయ టెక్వాండోలో పరిగి క్రీడాకారుల మెరుపు

## - రిషి నాయక్, నిషాంత్‌లకు స్వర్ణ పతకాలు










**పరిగి, ఆగస్టు 23(విజన్ ఆంధ్ర):** అంతర్జాతీయ స్థాయి టెక్వాండో పోటీల్లో పరిగి ఫిట్‌నెస్ టెక్వాండో అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. వివిధ దేశాలతో పాటు భారతదేశంలోని పలు రాష్ట్రాల నుంచి సుమారు 1,200 మంది క్రీడాకారులు పాల్గొన్న ఛాంపియన్‌షిప్‌లో అకాడమీకి చెందిన రిషి నాయక్, నిషాంత్‌లు స్వర్ణ పతకాలు సాధించారు. తిరుమలాపూర్ తండా, గూడూరు మండలానికి చెందిన రిషి నాయక్ సబ్ జూనియర్--అండర్ 21 వెయిట్ కేటగిరీలో బంగారు పతకం సాధించాడు. రాట్లావత్ సురేష్ కుమారుడైన రిషి నాయక్ అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచాడు.అదేవిధంగా పరిగికి చెందిన నిషాంత్ సబ్ జూనియర్--అండర్ 25 వెయిట్ కేటగిరీలో స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. నర్సింహులు కుమారుడైన నిషాంత్‌కు మాస్టర్ ఎండీ. కలీమ్ ఉద్దీన్ శిక్షణ అందిస్తున్నారు.ంతర్జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులతో పోటీపడి ఇద్దరు విద్యార్థులు స్వర్ణ పతకాలు సాధించడం పట్ల ఫిట్‌నెస్ టెక్వాండో అకాడమీ నిర్వాహకులు, కుటుంబ సభ్యులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు. క్రమశిక్షణ, కఠోర శ్రమ, అంకితభావంతో సాధన చేస్తే ఉన్నత స్థాయిలో విజయాలు సాధించవచ్చని ఈ విజయం నిరూపించిందని అకాడమీ నిర్వాహకులు తెలిపారు.విజేతలు రిషి నాయక్, నిషాంత్‌లను అకాడమీ సభ్యులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో విజయాలు సాధించి పరిగికి, తెలంగాణకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**- 20 రోజులుగా ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులు**

**- నాణ్యతతో పనులు చేపట్టాలని కార్పొరేటర్ మునిగడప పద్మ సూచన**

**- జాతీయ రహదారిపై 16వ డివిజన్‌లో సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన**



**కొత్తగూడెం బ్యూరో ఆగస్టు 23(విజన్ ఆంధ్ర) :** జాతీయ రహదారిపై 16వ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న సైడ్ డ్రైనేజీ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ మునిగడప పద్మ ఆదివారం పరిశీలించారు. కాల్వ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. గత 20 రోజులుగా డ్రైనేజీ నిర్మాణ పనుల కారణంగా జాతీయ రహదారి వెంట వ్యాపారాలు నిర్వహించుకుంటూ జీవిస్తున్న చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యాపారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను కోరారు. కాలువ నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నాసిరకం పనులకు తావులేకుండా పక్కాగా నిర్మాణం చేపట్టాలని సూచించారు. డ్రైనేజీ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి రహదారి వెంట వ్యాపారాలు నిర్వహించుకుంటున్న చిరు వ్యాపారులకు, స్థానిక ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. అభివృద్ధి పనులు ప్రజలకు ఉపయోగకరంగా ఉండటంతో పాటు.. పనుల సమయంలో ప్రజలు, వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కూడా అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మునిగడప వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చౌడవరంలో విషాదం

**- పెళ్లి చేద్దామనుకుంటే మృత్యు ఒడికి**



**వేంసూర్ ఆగస్టు 23 (విజన్ ఆంధ్ర):** ఖమ్మం జిల్లా వేంసూరు మండలం చౌడవరం గ్రామంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వివరాల్లో కెళ్తే వెంకటరాజు,పద్మ దంపతుల కుమారుడు నాగన బోయిన నరేష్ కుమార్ (29) డిగ్రీ పూర్తి చేసి నాలుగేళ్ల క్రితం యాదాద్రి భువనగిరి జిల్లా బూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెంలోని హెజె లో లాబరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగంలో చేరాడు. అయితే ఆ కంపెనీలో శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు రియాక్టర్ పేలడంతో నరేష్ కుమార్ మృత్యువాత పడ్డాడు. ఇదే మండలంలో వెంకటాపురం గ్రామానికి చెందిన వెదుళ్ళ చెన్నకేశవులు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. నరేష్ కుమార్ మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఇటీవలే కొత్త ఇల్లు కట్టు కున్నామని, త్వరలో కొడుకు పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తున్నామని,ఇంతలోనే ఇలా జరిగిందంటూ గుండెలవిసేలా రోదిస్తున్నారు. పెళ్లి సంబంధం కోసం రెండు రోజుల్లో వస్తానని చెప్పిన కొడుకు శవమై ఇంటికి రావడంతో ఆ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. త్వరలో పెళ్లితో కళకళలాడాల్సిన ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. నరేష్ తన ఊరులో అందరితో,స్నేహితులతో ఎంతో సరదాగా,మంచి మనసుతో, కలిసిమెలిసి ఉండేవాడు. ఈ ఘటనతో చౌడవరం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# అమ్మవారి నామస్మరణతో మార్మోగిన పందిళ్ళపల్లి..

**- శ్రావణ శోభలో ముత్యాలమ్మకు ఘనంగా బోనాల సమర్పణ**



**చింతకాని ఆగస్టు 23 విజన్ ఆంధ్ర.** ఆషాఢమాసం ముగిసి శ్రావణమాసం ఆరంభం కావడంతో పందిళ్ళపల్లిలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శ్రావణమాసం అమ్మవార్ల ఆరాధనకు విశేష ప్రాధాన్యత కలిగిన మాసంగా భావించే



నేపథ్యంలో ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుకలను గ్రామస్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ పెద్దకాపు రేఖం వెంకటేశ్వర్లు నివాసం నుంచి మహిళలు బోనాలను తలపై మోసుకుంటూ మంగళవాయిద్యాల నడుమ ఆలయం వరకు ర్యాలీగా తరలివచ్చారు. ఆలయానికి చేరుకున్న అనంతరం ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండాలని సకాలంలో వర్షాలు కురవాలని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. బోనాల వేడుకలకు మహిళలు యువకులు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరుకావడంతో గ్రామంలో ఎటుచూసినా పండుగ వాతావరణం నెలకొన్నది గ్రామస్థులంతా కలిసికట్టుగా అమ్మవారిని కొలవడం వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆనం ప్రభాకర్ రెడ్డి గ్రామ పెద్దలు ఇనుకుళ్ళ నాగసూరారెడ్డి అలవాల జనార్దన్ రావు మేకల తిరుపతి చల్లా భద్రారెడ్డి మందటి నరేష్ అలవాల వెంకట నరసయ్య రేఖం అచ్చయ్య మండే రామలింగయ్య కొమ్మినేని నాగేశ్వరరావు దేవరపల్లి ప్రవీణ్ రెడ్డి ఎనుముల చలమారెడ్డి మేకల సత్యనారాయణ ఈర్ల బ్రహ్మయ్య మందటి వెంకటేశ్వర్లు దారగాని రామారావు ఇనుకుళ్ల దివాకర్ రెడ్డి కొండపరెడ్డి రవీందర్ రెడ్డి దేవరపల్లి సుధాకర్ రెడ్డి షేక్ నాగూర్ సాహెబ్ చల్లా హనుమయ్య ఎస్కే సైదుద్దీన్ మేకల సౌజన్య లింగం రాంబాబు శివరాత్రి లక్ష్మయ్య కిలారు నర్సిరెడ్డి చల్లా వెంకటేశ్వర్ రెడ్డి మండే శ్రీనివాసరావు సింగారపు వీరభద్రం లింగం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# గాంధీ నగర్ ముత్యాలమ్మతల్లి ఆలయంలో ఘనంగా శ్రావణమాస ఉత్సవాలు



**పాల్వంచ, ఆగస్ట్ 23 (విజన్ ఆంధ్రప్రతినిధి ):** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధి లోని పాల్వంచ డివి జన్ నందు గల గాంధీ నగర్ 44వ డివిజన్లో 19 51 సంవత్సరం లో పెద్ద పాల చెట్టు కింద వేం చేసి ఉన్న శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయం లో నెల రోజులు పాటు జరిగే శ్రావణ మాస ఉత్సవాల్లో భాగం గా నేటికీ 11వ రోజు రెండ వ ఆది వారం సందర్భం గా అమ్మవారి ఆలయం లో భక్తు లు భక్తి శ్రద్ధలతో పూజల ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా పూజారి గడ్డం భాస్కర్ దాస్ ఆధ్వర్యం లో పూజ లు జరిగి నాయి. ఈ సందర్భంగా జరిగిన పూజ ల్లో భక్తు లు పొంగలి బోనా లను కోడిపుంజు లను అమ్మ వారి దేవాలయా నికి తీసు కొచ్చి వారి యొక్క మొక్కు లను తీర్చు కున్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గంగపురి నాగేశ్వరావు 44వ డివిజన్ రీసం శెట్టి విశ్వేశ్వర రావు దంపతులు ఝాన్సీ కొమ్మారపు ఆదం దంపతులు కేసు పాక వెంకటేశ్వర్లు ఒట్టికోట సుధాకర్ దంపతులు బుడగం హరీష్ దంపతులు వెచ్చర్ల సత్యనారాయణ దంపతులు మరియు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించి అమ్మవారి యొక్క తీర్థప్రసాదాలు స్వీకరించినారు.

# లచ్చమ్మకు సీపీఐ నేతల ఘన నివాళి

**- దశదిన కర్మలో చిత్రపటానికి పూలమాలలు..**

**- దండి సురేష్ పావులూరి మల్లికార్జునరావు దూసరి గోపాలరావు నివాళి**

**చింతకాని ఆగస్టు 23 విజన్ ఆంధ్ర.** సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు అమ్మమ్మ మెతరపు లచ్చమ్మ దశదిన కర్మ కార్యక్రమం ప్రొద్దుటూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లికార్జునరావు సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు లచ్చమ్మ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో సంబారి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



# ఆటో డ్రైవర్ల బంద్ కు సిపిఐ సంపూర్ణ మద్దతు



**ఖమ్మం అర్బన్ ఆగష్టు 23 (విజన్ఆంధ్ర)** ఆటో క్యాబ్ వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సోమవారం నిర్వహిస్తున్న రాష్ట్ర వ్యాప్త బంద్ సిపిఐ జిల్లా సమితి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న ఆటో క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలన్నారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లకు ఉపాధి కరువైందన్నారు. పెరిగిన ఇంధన ధరలు, అధిక పన్నులు, ఇన్సూరెన్స్ భారంతో డ్రైవర్లు ఆర్థిక భారంతో ఇబ్బందులు - పడుతున్నారన్నారు. ఓలా, ఊబర్, ర్యాపిడో వంటి యాప్ల వల్ల ఉపాధి కోల్పోతున్నారన్నారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు పెట్రోల్ ధరలను తగ్గించాలని డ్రైవర్లకు సామాజిక భద్రత ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఆటోల బంద్ ను ప్రజలు కూడా సహకరించాలని సురేష్ కోరారు

# ఇన్‌స్టాగ్రామ్ ప్రేమలు.. పెళ్లిళ్లు.. చివరికి విడాకులు!

- లైక్‌తో పరిచయం చాటింగ్‌తో ప్రేమ.. పెళ్లితో పంచాయితీ!
- రీల్స్‌లో ప్రేమ రియల్ లైఫ్‌లో కన్నీళ్లు!
- 'ఫాలో'తో మొదలై.. 'ఫ్యామిలీ కోర్టు' వరకు!




సోషల్ మీడియా.. నేటి ఆధునిక జీవితంలో విడదీయరాని భాగంగా మారిపోయింది. ముఖ్యంగా యువత జీవితాల్లో ఇన్‌స్టాగ్రామ్‌కు ప్రత్యేక స్థానం ఏర్పడింది. ఫోటోలు, రీల్స్, స్టోరీలు, లైక్స్, కామెంట్లు, డైరెక్ట్ మెసేజ్‌లు.. ఇలా నిత్యం కొత్త పరిచయాలకు సోషల్ మీడియా వేదికగా మారుతోంది. ఒకప్పుడు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల ద్వారా పరిచయాలు ఏర్పడేవి. ఇప్పుడు ఒక్క 'ఫాలో'తోనే కొత్త సంబంధానికి తలుపులు తెరుచుకుంటున్నాయి. మొదట ఒకరి ఫోటోకు లైక్.. తర్వాత కామెంట్.. ఆపై డైరెక్ట్ మెసేజ్.. గంటల తరబడి చాటింగ్.. ఫోన్ కాల్స్.. వీడియో కాల్స్.. ఇలా పరిచయం క్రమంగా స్నేహంగా, స్నేహం ప్రేమగా మారుతోంది. కొందరు యువతీ యువకులు ఈ పరిచయాన్ని పెళ్లి వరకు తీసుకెళ్తున్నారు. కుటుంబ సభ్యులను ఒప్పించి వివాహం చేసుకుంటున్న వారు కొందరైతే.. కుటుంబాలను ఎదిరించి, ఇంటి నుంచి వెళ్లిపోయి పెళ్లిళ్లు చేసుకుంటున్న జంటలు మరికొందరు. అయితే.. ప్రేమ పెళ్లిగా మారిన తర్వాతే అసలు జీవితం మొదలవుతోంది. అప్పటి వరకు కనిపించని అనేక సమస్యలు పెళ్లి తర్వాత ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.

### ప్రేమలో కనిపించని సమస్యలు.. పెళ్లి తర్వాత బయటపడుతున్నాయా?

ప్రేమలో ఉన్నప్పుడు ఒకరినొకరు ఆకట్టుకోవడానికి ఇద్దరూ ప్రయత్నిస్తారు. గంటల తరబడి మాట్లాడుకుంటారు. తమకు నచ్చిన విషయాలనే ఎక్కువగా పంచుకుంటారు. సోషల్ మీడియాలో కనిపించే వ్యక్తిత్వాన్ని చూసి ఎదుటి వ్యక్తి గురించి పూర్తిగా అర్థం చేసుకున్నామని భావిస్తారు. కానీ సోషల్ మీడియాలో కనిపించే వ్యక్తిత్వం.. నిజ జీవితంలోని వ్యక్తిత్వం ఒకటే కావాల్సిన అవసరం లేదు. పెళ్లి తర్వాత ఉద్యోగం, ఆర్థిక పరిస్థితులు, కుటుంబ బాధ్యతలు, అత్తమామల సంబంధాలు, పిల్లల పెంపకం, వ్యక్తిగత స్వేచ్ఛ, స్నేహాలు, ఆర్థిక నిర్ణయాలు వంటి ఎన్నో అంశాలు జీవితంలోకి వస్తాయి. ఈ పరిస్థితుల్లో ఇద్దరి ఆలోచనా విధానాలు భిన్నంగా ఉంటే చిన్న చిన్న విభేదాలు పెద్ద సమస్యలుగా మారే అవకాశం ఉంది.

### 'ఆన్‌లైన్' స్నేహాలు.. 'ఆఫ్‌లైన్' అనుమానాలు!

పెళ్లి తర్వాత కూడా సోషల్ మీడియాలో కొత్త పరిచయాలు కొనసాగడం, పాత స్నేహితులతో చాటింగ్ చేయడం, ఇతరుల పోస్టులకు కామెంట్లు పెట్టడం వంటి విషయాలు కొన్నిసార్లు భార్యాభర్తల మధ్య అనుమానాలకు కారణమవుతున్నాయి.

'ఎవరితో చాటింగ్ చేస్తున్నావు?'

'ఎందుకు రాత్రివేళ ఫోన్ చూస్తున్నావు?'

'ఆ వ్యక్తి నీ పోస్టుకు ఎందుకు కామెంట్ చేశాడు?'

'ఎవరితో ఇంతసేపు మాట్లాడుతున్నావు?'

అంటూ మొదలయ్యే ప్రశ్నలు క్రమంగా వాగ్వాదాలకు దారితీస్తున్నాయి.

మొదట ఫోన్ పాస్‌వర్డ్ అడగడం.. ఆ తర్వాత ఫోన్ చెక్ చేయడం.. సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించడం.. చివరకు ఒకరిపై ఒకరికి నమ్మకం తగ్గిపోవడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. నమ్మకం ఉన్న చోట ప్రశ్నలు తగ్గుతాయి.. అనుమానం పెరిగిన చోట ప్రతి చిన్న విషయం పెద్దదవుతుంది.

### లైక్స్.. కామెంట్లు.. ఫాలోవర్లు.. కుటుంబ కలహాలకు కారణమా?

ఒక ఫోటోకు వచ్చిన లైక్ కూడా కొన్నిసార్లు భార్యాభర్తల మధ్య చర్చకు దారితీస్తోంది. ఎవరు లైక్ చేశారు? ఎవరు కామెంట్ చేశారు? ఎవరిని ఫాలో అవుతున్నారు? ఎవరితో ఎక్కువగా మాట్లాడుతున్నారు? వంటి విషయాలపై అనుమానాలు పెరుగుతున్నాయి.

కొంతమంది జీవిత భాగస్వామి సోషల్ మీడియా కార్యకలాపాలను నిరంతరం గమనిస్తున్నారు. ప్రతి పోస్టును పరిశీలించడం, ప్రతి కామెంట్‌పై ప్రశ్నించడం, ఎవరితో చాటింగ్ చేస్తున్నారో తెలుసుకునే ప్రయత్నం చేయడం దాంపత్య జీవితంలో ఒత్తిడిని పెంచుతోంది.

సోషల్ మీడియా వినియోగం విషయంలో పరస్పర అవగాహన లేకపోతే.. అది క్రమంగా దాంపత్య బంధంలో చీలికలకు కారణమయ్యే ప్రమాదం ఉంది.

### రీల్ లైఫ్ వేరు.. రియల్ లైఫ్ వేరు!

ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపించే జీవితాన్ని చూసి అదే నిజమైన జీవితం అనుకోవడం కూడా యువతలో పెరుగుతున్న మరో సమస్య. ఖరీదైన రెస్టారెంట్లు.. టూర్లు.. ఫ్యాషన్.. రొమాంటిక్ ఫోటోలు.. నవ్వులు.. సెలబ్రేషన్లు.. సంతోషకరమైన క్షణాలు.. ఇవే ఎక్కువగా సోషల్ మీడియాలో కనిపిస్తాయి.

### కానీ ఒక విషయం గుర్తుంచుకోవాలి..

సోషల్ మీడియాలో కనిపించే 30 సెకన్ల రీల్ వెనుక ఉన్న 30 సంవత్సరాల జీవితాన్ని అంచనా వేయలేం. ప్రతి వ్యక్తి తన జీవితంలోని అందమైన క్షణాలనే ఎక్కువగా సోషల్ మీడియాలో పంచుకుంటారు. కష్టాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, వ్యక్తిగత సంఘర్షణలు సాధారణంగా బయటకు కనిపించవు. అందుకే ఒకరి సోషల్ మీడియా ప్రొఫైల్ చూసి వారి వ్యక్తిత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.

### చాటింగ్ ఆధారంగా జీవిత భాగస్వామి ఎంపిక?

కొత్త పరిచయం ఏర్పడిన వెంటనే గంటల తరబడి చాటింగ్ చేయడం ద్వారా ఎదుటి వ్యక్తి గురించి పూర్తిగా తెలుసుకున్నామని కొందరు భావిస్తున్నారు. కానీ చాటింగ్‌లో చెప్పే మాటలు, నిజ జీవితంలో ప్రవర్తించే తీరు ఒకేలా ఉండకపోవచ్చు. జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకోవడం అనేది కేవలం భావోద్వేగంతో తీసుకునే నిర్ణయం కాదు. అది జీవితాంతం ప్రభావం చూపే నిర్ణయం. వ్యక్తి స్వభావం, బాధ్యతాయుతమైన ప్రవర్తన, కుటుంబ నేపథ్యం, ఆలోచనా విధానం, భవిష్యత్ లక్ష్యాలు, ఆర్థిక విషయాలపై అవగాహన, కుటుంబంపై ఉన్న బాధ్యత వంటి అంశాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.

### ప్రేమ పెళ్లిగా మారిన తర్వాత.. బాధ్యతలు పెరుగుతాయి

ప్రేమలో ఉన్నప్పుడు ఇద్దరి మధ్య వ్యక్తిగత సంబంధమే ప్రధానంగా ఉంటుంది. కానీ పెళ్లి తర్వాత రెండు కుటుంబాలు కలుస్తాయి. బాధ్యతలు పెరుగుతాయి. ఇంటి ఖర్చులు.. ఉద్యోగం.. కుటుంబ సభ్యులు.. పిల్లల భవిష్యత్తు.. అత్తమామల సంబంధాలు.. ఆర్థిక నిర్ణయాలు.. వ్యక్తిగత స్వేచ్ఛ.. ఇలా అనేక అంశాలను ఇద్దరూ కలిసి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రేమ సమయంలో వీటిని పెద్దగా పట్టించుకోకుండా కేవలం భావోద్వేగాల ఆధారంగా పెళ్లి చేసుకుంటే.. తర్వాత సమస్యలు ఎదురైనప్పుడు వాటిని పరిష్కరించుకోవడం కష్టమవుతుంది.

### చిన్న గొడవ.. పెద్ద విభేదం.. చివరకు విడాకులు!

దాంపత్య జీవితంలో చిన్న చిన్న విభేదాలు సహజమే. కానీ వాటికి సోషల్ మీడియా అనుమానాలు తోడైతే పరిస్థితి మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉంది.

మొదట మాటలు తగ్గుతాయి.

తర్వాత ఒకే ఇంట్లో ఉన్నా.. వేర్వేరు జీవితాలు మొదలవుతాయి.

ఆ తర్వాత కుటుంబ సభ్యుల జోక్యం పెరుగుతుంది.

చివరకు కౌన్సెలింగ్, న్యాయపరమైన మార్గాలను ఆశ్రయించే పరిస్థితి రావచ్చు.

కొన్ని సందర్భాల్లో సంబంధం పూర్తిగా దెబ్బతిని విడాకుల వరకు వెళ్లే పరిస్థితి కూడా ఏర్పడవచ్చు.

అయితే ప్రతి సోషల్ మీడియా ప్రేమ విఫలమవుతుందని కాదు. ప్రతి ప్రేమ వివాహం విడాకులకు దారితీస్తుందని కూడా కాదు.

పరస్పర గౌరవం, నమ్మకం, నిజాయితీ, బాధ్యత, అవగాహన ఉన్నప్పుడు సోషల్ మీడియా ద్వారా ఏర్పడిన పరిచయం కూడా విజయవంతమైన దాంపత్యంగా మారవచ్చు.

### యువత ఏం ఆలోచించాలి?

సోషల్ మీడియాలో పరిచయమైన వ్యక్తిని జీవిత భాగస్వామిగా ఎంచుకోవాలనుకునే ముందు తొందరపడకూడదు. కొంత సమయం తీసుకోవాలి. కేవలం చాటింగ్‌లో తెలుసుకున్న విషయాలను మాత్రమే నిజమని నమ్మకూడదు.

వారి స్వభావం ఎలా ఉంది?

కుటుంబం పట్ల వారి ఆలోచన ఏమిటి?

బాధ్యతలను ఎలా తీసుకుంటారు?

భవిష్యత్ లక్ష్యాలు ఏమిటి?

ఆర్థిక విషయాలపై వారి అవగాహన ఎలా ఉంది?

కుటుంబ జీవితంపై వారి అభిప్రాయం ఏమిటి?

వివాహం తర్వాత వచ్చే బాధ్యతలను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారా?

అనే విషయాలను తెలుసుకోవాలి.

భావోద్వేగంలో తీసుకున్న నిర్ణయం.. జీవితాంతం ప్రభావం చూపే అవకాశం ఉంది.

ప్రేమలో పడటం సులభం.. నిలబెట్టుకోవడం కష్టం!

ప్రేమలో పడటం సులభం..

ప్రేమను నిలబెట్టుకోవడం కష్టం..

పెళ్లి చేసుకోవడం ఒక నిర్ణయం..

ఆ బంధాన్ని జీవితాంతం కాపాడుకోవడం అసలైన బాధ్యత!

పెళ్లి తర్వాత వచ్చే చిన్న చిన్న సమస్యలను మాట్లాడుకుని పరిష్కరించుకోవాలి. ప్రతి సమస్యను అనుమానంతో చూడకూడదు. ఒకరి వ్యక్తిగత స్వేచ్ఛను మరొకరు గౌరవించాలి. ముఖ్యంగా సోషల్ మీడియా విషయాల్లో పరస్పర నమ్మకం, పారదర్శకత అవసరం.

### సోషల్ మీడియా తప్పు కాదు.. వినియోగించే విధానం ముఖ్యం

ఇన్‌స్టాగ్రామ్ లేదా ఇతర సోషల్ మీడియా వేదికలను నిందించడం మాత్రమే పరిష్కారం కాదు. అవి కేవలం సాధనాలు. వాటిని ఎలా ఉపయోగిస్తున్నామన్నదే ముఖ్యం.

సోషల్ మీడియాలో పరిచయాలు ఏర్పడవచ్చు. స్నేహాలు పెరగవచ్చు. ప్రేమ కూడా పుట్టవచ్చు. కానీ జీవిత భాగస్వామిని ఎంచుకోవడం మాత్రం కేవలం సోషల్ మీడియా ప్రొఫైల్, ఫోటోలు, రీల్స్, చాటింగ్ ఆధారంగా జరగకూడదు.

రీల్‌లో రెండు నిమిషాల ప్రేమకథ అందంగా కనిపించొచ్చు.. కానీ రియల్ లైఫ్‌లో అదే ప్రేమను సంవత్సరాల తరబడి నిలబెట్టుకోవాలంటే నమ్మకం, ఓర్పు, గౌరవం, బాధ్యత తప్పనిసరి.

**చివరికి ప్రశ్న ఒక్కటే..**

ఇన్‌స్టాగ్రామ్‌లో మొదలైన ప్రేమను పెళ్లి వరకు తీసుకెళ్లడమే విజయమా?

లేక పెళ్లి తర్వాత కూడా అదే ప్రేమను, నమ్మకాన్ని, గౌరవాన్ని కాపాడుకోవడమే అసలైన విజయమా?

రీల్స్ మారిపోతాయి..

ట్రెండ్స్ మారిపోతాయి..

ఫాలోవర్లు మారిపోతారు..

కానీ జీవిత భాగస్వామితో ఏర్పడిన బంధం మాత్రం జీవితాంతం కొనసాగాల్సిందే.

అందుకే..

ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రేమకు ముందు ఆలోచించాలి..

పెళ్లికి ముందు తెలుసుకోవాలి..

పెళ్లి తర్వాత నమ్మాలి..

అనుమానాలకంటే అవగాహనకు ప్రాధాన్యం ఇవ్వాలి..

ఎందుకంటే.. రీల్ లైఫ్ కొన్ని సెకన్లే.. కానీ రియల్ లైఫ్ మొత్తం జీవితం!

**- ఉమా కాంత్**
**కొత్తగూడెం బ్యూరో**

# రక్తబంధాలే ముఖం చాటేసిన వేళ

# స్నేహబంధమే అండగా నిలిచింది

**- కష్టకాలంలో చేతులు దులుపుకోని చిన్ననాటి మిత్రులు**

**- మరణం విషాదంలో మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచి మానవత్వం చాటారు**



**బోనకల్ ఆగస్టు 23 విజన్ ఆంధ్ర.** కష్టకాలం వచ్చినప్పుడు ఎవరు మనవారో ఎవరు పరాయివారో తెలిపోతుంది రక్తసంబంధం ఉందనే పేరుతో దగ్గరగా మెలిగేవారు ఆపద వేళ కనీసం పలకరించేందుకు కూడా ముందుకు రాని పరిస్థితులు కనిపిస్తున్నాయి అలాంటి వేళ రక్తబంధం లేకపోయినా చిన్ననాటి స్నేహాన్ని రక్తబంధం కంటే గొప్పదిగా నిలబెట్టారు 1992 93 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన మిత్రులు తమ చిన్ననాటి స్నేహితుడు కొట్టె దాస్ మృతితో విషాదంలో ఉన్న కుటుంబానికి తోడుగా నిలిచారు మిత్రుడి మరణవార్తతో కేవలం సంతాపం తెలిపి వెళ్లిపోకుండా ఇంటికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించి రూ 18 300 ఆర్థిక సాయం అందించారు మిత్రుడు లేడన్న లోటును ఎవరూ పూడ్చలేకపోయినా ఆయన కుటుంబానికి తాము ఉన్నామనే ధైర్యాన్ని కల్పించారు రక్తబంధీకులే కష్టాల్లో ఉన్నవారిని పరాయివారిలా చూస్తున్న వేళ ఏళ్ల నాటి స్నేహాన్ని మరచిపోకుండా కుటుంబానికి చేయూతనివ్వడం ద్వారా నిజమైన మానవత్వాన్ని చాటారు సంతోషాల్లో కలిసి నవ్వడం మాత్రమే స్నేహం కాదని బాధలో తోడుగా నిలవడమే అసలైన స్నేహమని నిరూపించారు చిన్నతనంలో కలిసి చదువుకున్న అనుబంధం కాలంతో పాటు చెరిగిపోదని తమ చర్యతో చూపించారు జీవితంలో ఎవరి దారులు వారు చూసుకున్నా ఆపద సమయంలో మాత్రం మిత్రుడి కుటుంబాన్ని తమ కుటుంబంగా భావించి సహాయం చేయడం ద్వారా ఆదర్శంగా నిలిచారు పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబానికి ఆర్థిక సహకారంతో పాటు మానసిక ధైర్యాన్ని అందించారు ఆ సమయంలో ఇచ్చిన సాయం కంటే అండగా నిలిచిన మనసే గొప్పదని చాటిచెప్పారు భవిష్యత్తులోనూ అవసరమైన సందర్భాల్లో కుటుంబానికి సహకరిస్తామని భరోసా ఇచ్చారు స్నేహం పేరుతో మాటలకే పరిమితం కాకుండా ఆపదలో ఆచరణ ద్వారా తమ బంధాన్ని నిరూపించారు మిత్రుడు దూరమైనా ఆయన కుటుంబంతో అనుబంధం కొనసాగుతుందని స్పష్టం చేశారు సమాజంలో మానవత్వం ఇంకా బతికే ఉందని తమ సేవా భావంతో చాటారు రక్తబంధాలకే ప్రాధాన్యం ఇస్తున్న ఈ కాలంలో స్నేహబంధం కూడా కుటుంబ అనుబంధానికి ఏమాత్రం తీసిపోదని నిరూపించిన మిత్రుల తీరును గ్రామ సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వరరావు అభినందించారు

# దృఢమైన సంకల్పంతో లక్ష్యాన్ని సాధించాలి

**- రత్న దీపిక**




**బూర్గంపాడు ఆగస్టు 23 (విజన్ ఆంధ్ర)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లో సారపాక గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సారపాకలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి దూద అధ్యక్షతన ప్రత్యేకంగా బాలికల కొరకు సభ నిర్వహించారు. ఈ సభలో రోల్ మోడల్ గా హాజరైన ఈ పాఠశాల పూర్వ విద్యార్థిని కుమారి కింతాడి రత్న దీపిక విద్యార్థులను ఉత్తేజపరుస్తూ ప్రసంగించారు. జీవితంలో ఒక గోల్ పెట్టుకుని దానిని సాధించాలంటే ఎలాంటి ఆటంకాలు వచ్చినా దృఢ సంకల్పంతో ఎదుర్కొని అధిగమించాలని ఉద్బోధించారు. క్రమశిక్షణ , పట్టుదల ఇందుకు చాలా అవసరమని అన్నారు. సెల్ ఫోన్ తో సమయం వృథా చేసుకోవద్దని అన్నారు.తాను మొదటి నుండి ప్రభుత్వ పాఠశాలలోనూ, ప్రభుత్వ పాలిటెక్నిక్ లోను చదువు పూర్తి చేసి ఈనాడు గ్రాన్యూల్ ఇండియా లిమిటెడ్ అనే కంపెనీలో సీనియర్ టెక్నికల్ అసోసియేట్ గా ఉద్యోగం చేస్తున్నానని తెలియజేశారు. చదువు ద్వారానే మహిళల సాధికారత సాధ్యమవుతుందని చెప్పారు. తన విజయ ప్రస్థానంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చారని తెలిపారు. కడు పేదరికం నుండి కష్టపడి ఉన్నత స్థాయికి చేరిన రత్నకుమారిని ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్క అమ్మాయి ఎదగాలని ప్రధానోపాధ్యాయురాలు ఈ సందర్భంగా తెలిపారు. సభ అనంతరం కుమారి రత్న దీపికు మెమొంటో అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కే శ్రీదేవి, టి కృష్ణవేణి, సిహెచ్ హేమ, బి స్వరూప, మరియు పి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



## టేకులగూడెంలో ఘనంగా బోనాల పండుగ



**కారేపల్లి,ఆగస్టు 23(విజన్ ఆంధ్ర) :** శ్రావణ మాసంలో బోనాల పండుగ సందర్భంగా సింగరేణి మండలంలోని టేకులగూడెం గ్రామపంచాయతీలో ఆదివారం ఘనంగా బోనాల పండుగను జరుపుకున్నారు.గ్రామంలో ఉన్న ముత్యాలమ్మ తల్లికి అత్యంత భక్తి శ్రద్ధలతో మహిళలు వండిన అన్నం,పాలు,బెల్లంతో నైవేద్యాన్ని మట్టి కుండలు,రాగి కుండలో వండి,ముత్యాలమ్మ తల్లికి పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గుమ్మడి సందీప్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చాక బోనాల పండుగను రాష్ట్ర పండుగ గా గుర్తించారని,ఈ బోనాలు అత్యంత ప్రాచుర్యం పొందాయని అన్నారు. బోనము అంటే భోజనము అనే పదానికి వికృతి రూపమే బోనం అని అర్థం అని,ఊరు పచ్చగా ఉండాలని,పాడిపంటలు సమృద్ధిగా పండాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామము అభివృద్ధిలో ఉండాలని కోరుకున్నారు.ఈ బోనాల పండుగ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గుమ్మడి ఎర్రయ్య,ముత్తి రామారావు,గుగ్గిల రామారావు, దోమల నాగేశ్వరరావు,కోడం సీతారాములు,జోగ రవి,పాలకవర్గ సభ్యులు ఉప సర్పంచ్ బిక్కసాని భాస్కర్ రావు,దోమల సీత,కొడెం రమణ,గుమ్మడి నరసింహారావు,గ్రామ మహిళలు,ప్రజలు పాల్గొని బోనాల్ని సమర్పించారు.

## బూర్గంపాడు మండలంలో గంజాయి సేవిస్తూ పట్టుబడిన ముగ్గురు



**బూర్గంపాడు ఆగస్టు 23(విజన్ ఆంధ్ర)** బూర్గంపాడు మండలం తాళ్లగొమ్మూరు ఐటీసీ జామాయిల్ తోటలో గంజాయి సేవిస్తున్న ముగ్గురిని పోలీసులు పట్టుకున్నారు. గడికొప్పుల శశికుమార్, సోము సీతారామిరెడ్డి, మహమ్మద్ అఫ్రోజ్ను అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షల్లో మత్తు పదార్థం సేవించినట్లు నిర్ధారణ కావడంతో భద్రాచలంలోని పునరావాస కేంద్రానికి తరలించారు. పరిసరాల్లో గంజాయి సేవిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

## పోతిరెడ్డివారి వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే పాయం దంపతులు



**పాల్వంచ ప్రతినిధి ఆగస్టు 23(విజన్ ఆంధ్ర)** పాల్వంచ మండలం పెద్దమ్మతల్లిసన్నిదానం పరిధిలోని ఎ కన్వెన్షన్'హాల్ నందు బూర్గంపహాడ్ మండల ప్రముఖ పారిశ్రామికవేత్త,లక్ష్మీపురం పంచాయతీ మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్'లు శ్రీమతి శ్రీ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సత్యవతి దంపతుల కుమారుడు చెన్నకేశవ రెడ్డి- స్రవంతి"ల వివాహ మహోత్సవ వేడుకకు హాజరై నూతన వధూవరులకు అక్షింతలువేశాశీర్వదించి, వధూవరులకు నూతన వస్త్రాలు అందించి, ఆత్మీయ శుభాకాంక్షలు తెలియజేసిన పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు దంపతులు మరియు పాత్రికేయ మిత్రురాలు విజన్ ఆంధ్ర పాల్వంచ ప్రతినిధి మేకల జ్యోతి దంపతులు పాల్గొన్నారు.

# కాలం చెల్లిన వైద్య పరికరాలపై నిఘా ఏదీ

- లక్షల్లో పెట్టుబడి కోట్లలో ఆదాయం అయినా తనిఖీలు శూన్యం...?
- రేడియేషన్ ముప్పుపై పర్యవేక్షణ ఏదీ..?
- స్కానింగ్ యంత్రాల పనితీరుపై అధికారుల తనిఖీలు ఎక్కడ..?
- మందుల్లో రూపాయి పెట్టుబడి తొమ్మిది రూపాయల లాభమా..?
- రోగి అవసరాన్ని ఆసరాగా చేసుకుని వైద్యం వ్యాపారంగా మారిందా..?
- ఆర్ఎంపీలను అడ్డుపెట్టుకుని రోగుల తరలింపు వ్యవహారం
- ఆసుపత్రులకు పంపితే ఏటా చెల్లింపులంటూ ఆరోపణలు....?
- డాక్టర్లు దేవుడి తర్వాత దేవుడని నమ్ముతున్న ప్రజలు
- ఎంతైనా పర్వాలేదు అన్న ధోరణిపై అధికారుల నిఘా ఏదీ..?




**ఖమ్మం ఇన్చార్జి బ్యూరో.. ఆగస్టు 23 విజన్ ఆంధ్ర :** ఖమ్మం నగరంలో సుమారు 900కు పైచిలుకు ఆసుపత్రులు ఉన్న నేపథ్యంలో ఇన్ని ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిబంధనల ప్రకారం కొనసాగుతున్నాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది ఆసుపత్రుల్లో వినియోగిస్తున్న ఎక్స్ రే స్కానింగ్ ఎంఆర్ఐ తదితర కీలక వైద్య పరికరాలకు అనుమతులు ఎలా ఇస్తున్నారు వాటి పనితీరును ఎవరు తనిఖీ చేస్తున్నారు పరికరాల నిర్వహణ భద్రతా ప్రమాణాలను ఎవరు పర్యవేక్షిస్తున్నారు అనే ప్రశ్నలు ప్రజల్లో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి రోగుల ప్రాణాలతో ముడిపడిన పరికరాల విషయంలో నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని ప్రజలు కోరుతున్నారు అన్నింటికీ కాలపరిమితి ఉంటుంది కాలం చెల్లిన వస్తువులను వినియోగిస్తే అధికారులు చర్యలు తీసుకుంటారు అయితే వైద్యరంగంలో అత్యంత కీలకమైన ఎక్స్ రే స్కానింగ్ ఎంఆర్ఐ తదితర పరికరాల విషయంలో మాత్రం అదే స్థాయిలో తనిఖీలు జరుగుతున్నాయా లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి ముఖ్యంగా రేడియేషన్ వెలువరించే పరికరాల విషయంలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా వాటి నిర్వహణ ఎప్పటికప్పుడు జరుగుతోందా సిబ్బందికి అవసరమైన భద్రతా చర్యలు ఉన్నాయా అనే అంశాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు పరికరాల పనితీరులో లోపాలు ఉంటే రోగ నిర్ధారణపై ప్రభావం పడటమే కాకుండా అవసరానికి మించి రేడియేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంటుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు లక్షల నుంచి కోట్ల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేస్తున్న స్కానింగ్ పరికరాల విషయంలో కేవలం అనుమతులు తీసుకోవడంతో బాధ్యత పూర్తయినట్లు కాకుండా వాటి నిర్వహణ పనితీరు భద్రతా ప్రమాణాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ప్రజలు అంటున్నారు పరికరాల ధ్రువపత్రాలు అనుమతులు నిర్వహణ రికార్డులు భద్రతా ప్రమాణాలను అధికారులు తనిఖీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు రేడియేషన్‌కు సంబంధించిన పరికరాల విషయంలో చిన్న నిర్లక్ష్యం కూడా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ప్రత్యేక నిఘా అవసరమని చెబుతున్నారు ఇదిలా ఉండగా కొన్ని ఆసుపత్రుల్లో మందుల విక్రయాల్లో రూపాయి పెట్టుబడికి తొమ్మిది రూపాయల లాభం పొందుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి రోగులకు అవసరమైన మందుల పేరుతో అధిక ధరలు వసూలు చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి ఆసుపత్రి వైద్యం పరీక్షలు మందులు అన్నీ ఒకే వ్యవస్థగా మారి రోగిపై ఆర్థిక భారం పెంచుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి అయితే ఈ ఆరోపణల్లో వాస్తవం ఎంత అన్నది సంబంధిత అధికారులు సమగ్ర తనిఖీలతో తేల్చాల్సిన అవసరం ఉంది మరోవైపు ఆర్ఎంపీలను అడ్డుపెట్టుకుని కొత్తగా ఆసుపత్రులు ఏర్పాటు చేసి నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు పొందుతున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి కొందరు ఆసుపత్రి నిర్వాహకులు ఆర్ఎంపీలతో ఒప్పందాలు కుదుర్చుకుని తమ ఆసుపత్రులకు రోగులను పంపించాలని ప్రోత్సాహకాలు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి ఒక్కో ఆర్ఎంపీకి సంవత్సరానికి లక్ష రూపాయల వరకు చెల్లిస్తున్నారన్న ప్రచారం కూడా ఉంది అయితే ఇవి కేవలం ఆరోపణలేనా లేక వాస్తవంగా ఇలాంటి వ్యవహారాలు జరుగుతున్నాయా అన్నది అధికారులు విచారణ చేసి స్పష్టం చేయాల్సి ఉంది మరోవైపు వైద్యుడిగా విధులు నిర్వహించేందుకు అవసరమైన విద్యార్హతలు పూర్తిచేసిన వెంటనే తగిన అనుభవం లేకుండానే వైద్య సేవలు అందిస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి వైద్య సేవలు అందించే వారి అర్హతలు రిజిస్ట్రేషన్ వివరాలు వారు పనిచేస్తున్న విభాగంలో వారి అనుభవం తదితర అంశాలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు రోగుల ప్రాణాలతో ముడిపడిన వైద్య రంగంలో అర్హతల విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వైద్య సేవలు అందిస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు డాక్టర్లను రోగులు ప్రజలు దేవుడి తర్వాత దేవుడిగా కొలుస్తారు వైద్య వృత్తిపై సమాజంలో ఉన్న నమ్మకం అంతటి గొప్పది అయితే కొందరి వ్యవహార శైలితో మొత్తం వైద్యరంగానికే చెడ్డపేరు వస్తోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది ఠాగూర్ సినిమాలో చూపించిన ఎంతైనా పర్వాలేదు అన్న చందంగా రోగుల అవసరాలను ఆసరాగా చేసుకుని వైద్యాన్ని వ్యాపారంగా మార్చే ధోరణిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు వైద్య వృత్తిని సేవా దృక్పథంతో ప్రారంభించి కాలక్రమంలో భారీ స్థాయిలో వైద్య వ్యాపార సంస్థలను ఏర్పాటు చేసుకున్న వారు ఉన్నారని పలువురు ఆరోపిస్తున్నారు ఆసుపత్రుల అనుమతులు వైద్య పరికరాల నిర్వహణ మందుల విక్రయాలు రోగుల రిఫరల్స్ స్కానింగ్ కేంద్రాల పనితీరు వైద్యుల అర్హతలు వంటి అంశాలపై ఒకేసారి సమగ్ర తనిఖీలు నిర్వహిస్తే అనేక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు కేవలం పత్రాలు చూసి అనుమతులు మంజూరు చేయడం కాకుండా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు ల్యాబ్‌లలో రక్త పరీక్షలు మూత్ర పరీక్షలు ఇతర వైద్య నిర్ధారణ పరీక్షలకు ఉపయోగించే పరికరాల విషయంలోనూ ఇదే పరిస్థితి ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి ల్యాబ్‌లలో వినియోగించే పరీక్షా పరికరాల పనితీరు కచ్చితత్వం నిర్వహణ పరికరాల ప్రమాణాలు వాటికి సంబంధించిన అనుమతులు ధ్రువపత్రాలు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారా లేదా అన్నది ప్రశ్నగా మారింది పరికరాలు సక్రమంగా పనిచేయకపోతే పరీక్షల ఫలితాల్లో తేడాలు వచ్చే అవకాశం ఉండటంతో రోగ నిర్ధారణ చికిత్సపై ప్రభావం పడే ప్రమాదం ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఆసుపత్రుల్లో వైద్య పరికరాలతో పాటు ల్యాబ్‌లలో ఉపయోగించే ప్రతి పరీక్షా పరికరాన్ని కూడా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి వాటి పనితీరు కచ్చితత్వం నిర్వహణ రికార్డులు భద్రతా ప్రమాణాలను పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు వైద్య పరికరాల విషయంలో ముఖ్యంగా రేడియేషన్‌కు సంబంధించిన ఎక్స్ రే సిటి స్కాన్ తదితర పరికరాల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు పరికరాల పనితీరు రేడియేషన్ స్థాయిలు భద్రతా గదుల ప్రమాణాలు సిబ్బంది రక్షణ చర్యలు అనుమతులు నిర్వహణ రికార్డులు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు రోగులకు అవసరమైన పరీక్షలు మాత్రమే నిర్వహించేలా పర్యవేక్షణ ఉండాలని కోరుతున్నారు లక్షల్లో పెట్టుబడి పెట్టి కోట్లలో ఆదాయం ఆర్జించడమే లక్ష్యంగా వైద్య వ్యవస్థను వ్యాపార కేంద్రంగా మార్చే ధోరణికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు రోగి అంటే ఆదాయ వనరు కాదని వైద్యం అంటే వ్యాపారం కాదని అధికారులు గుర్తించాలని అంటున్నారు ఖమ్మం జిల్లాలోని ఆసుపత్రులు స్కానింగ్ కేంద్రాలు ల్యాబ్‌లు మందుల విక్రయాలు వైద్య పరికరాలు రోగుల రిఫరల్స్ అనుమతులు వైద్యుల అర్హతలు వంటి అంశాలపై ప్రత్యేక బృందాలతో సమగ్ర తనిఖీలు నిర్వహించి ఆరోపణల్లో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు



# అలంకారప్రాయం కాదు ఆదర్శవంతం..

- కేశవపురం అభివృద్ధి సారథి కాపుల శారద
- మాటలకే పరిమితం కాకుండా, చేతలతో గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న మహిళా నాయకత్వం







**చర్ల, ఆగస్టు 23 (విజన్ ఆంధ్ర):** సర్పంచ్ అనగానే కేవలం ఏదో ఒక పదవికి పరిమితం అనుకునే రోజులు పోయాయి, ప్రజల మధ్య ఉంటూ, వారి కష్టాలను స్వయంగా తెలుసు కుంటూ, సమస్యలకు తక్షణ పరిష్కారం చూపే నిజమైన నాయకురాలికి నిలువెత్తు రూపం కేశవపురం పంచాయతీ సర్పంచ్ కాపుల శారద, పదవిని కేవలం అలంకార ప్రాయంగా కాకుండా, గ్రామ సర్వముఖాభివృద్ధికి ఒక ఆనవాలుగా మలచుకుని ఆమె చేస్తున్న సేవలు నేడు పలు పంచాయతీలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి

### ప్రగతి బాటలో కేశవపురం గ్రామాలు

ఎంతో కాలంగా అవాంతరాలు ఎదుర్కొంటూ, రాకపోకలకు అనేక ఇబ్బందులు పడిన కేశవపురం ప్రజల కష్టాలను ఆమె ప్రత్యేక చొరవతో దూరం చేశారు, రోడ్ల వెంట ఇరువైపులా పెరిగిన పిచ్చి చెట్లను తొలగించడంతో పాటు, గుంతలు పడిన రహదారులను బాగు చేయించి ప్రయాణం సాఫీగా సాగేలా చేశారు, దీనివల్ల ఏళ్ల తరబడి పడిన ప్రజల ఇబ్బందులు పూర్తిగా తొలగిపోయాయి

### వెలుగులీనుతున్న వీధులు - పరిశుభ్రతే ధ్యేయం

మనం నివసించే ప్రాంతం పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు అనే గట్టి నమ్మకంతో శారద ముందుకు సాగుతున్నారు, ఊరిలో ఎక్కడా చెత్తాచెదారం పేరుకుపోకుండా ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి పకడ్బందీగా అమలు చేస్తున్నారు, అంతేకాకుండా, ప్రతి వీధిలోనూ, ప్రతి విద్యుత్ స్తంభానికి దీపాలు వెలిగేలా చేసి రాత్రివేళల్లోనూ రహదారులను కాంతివంతంగా మలచారు

### ఐక్యమత్యంతో ముందుకు

సర్పంచ్‌గా తన విధులను బాధ్యతాయుతంగా నిర్వహిస్తూనే, గ్రామస్తులందరినీ ఒకే తాటిపై నడిపిస్తున్న తీరు ప్రశంసనీయం, గ్రామ అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ, అందరి భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్న కాపుల శారద పనితీరును కేశవపురం ప్రజలు అభినందిస్తున్నారు, ఒక మహిళా సర్పంచ్ తలుచుకుంటే గ్రామాన్ని ఏ విధంగా మార్చవచ్చో కేశవపురం అభివృద్ధి ద్వారా ఆమె నిరూపించి చూపించారు

### ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా పని చేస్తా

ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్ గా నమ్మకమైన వ్యక్తిగా ఉంటూ గ్రామ అభివృద్ధిలో మమైకం అవుతు అభివృద్ధికి ఆనవాలుగా కేశవపురం పంచాయతీని ఉత్తమ పంచాయతీగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు సర్పంచ్ కాపుల శారద , తాను చేస్తున్న అభివృద్ధికి ప్రజల సహకారం కుటుంబ సభ్యుల సహకారం ప్రభుత్వ అధికారుల సహకారం తోనే ముందుకు సాగుతున్నానని చెప్పుకొస్తున్నారు సర్పంచ్ శారద, మండలంలోని కేశవాపురం గ్రామపంచాయతీకి ఓ ప్రత్యేకమైన గుర్తింపు తీసుకురావాలని ప్రయత్నం చేస్తున్నారు, నమ్మకంతో ఓటేసి గెలిపించిన ప్రజల అవసరాలు తీర్చే సర్పంచ్ గా చిర స్థాయిగా నిలబడమే తన లక్ష్యమని చెప్పుకొస్తున్నారు సర్పంచ్ కాపుల శారద.

# గత ప్రభుత్వంలో అభివృద్ధి పనుల నాణ్యతపై ధ్యాస లేదు కమిషన్ల పైనే ఎక్కువ ధ్యాస

- తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి
- కాగ్నా బ్రిడ్జి పగుళ్లను పరిశీలించిన ఎమ్మెల్యే.



**తాండూరు ఆగస్టు 23 (విజన్ ఆంధ్ర)** గత ప్రభుత్వంలో పాలకులకు అభివృద్ధి పనులు నాణ్యత పై ధ్యాస లేదని కేవలం కమిషన్లపైనే ధ్యాస తోనే కాదు నాన్నది నిర్మాణం పనుల్లో నాణ్యత లోపించిందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్యే కాగ్న నది బ్రిడ్జిపై ఏర్పడిన పగుళ్లను ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనుల నాణ్యతపై సరైన శ్రద్ధ చూపకుండా, కమిషన్లపైనే ఎక్కువ దృష్టి పెట్టారని ఆరోపించారు. కాగ్నా నదిపై నిర్మించిన వంతెనకు ఒకే ఏడాదిలో రెండు సార్లు పగుళ్లు ఏర్పడటం అందుకు నిదర్శనమని అన్నారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, వంతెనకు అవసరమైన మరమ్మతులు, నాణ్యతా ప్రమాణాలపై సంబంధించి తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మరమతులను వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక పార్టీ నాయకులు కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

# ఖమ్మం బోనకల్లు రహదారిపై మృత్యుఘోష....

- రామకృష్ణాపురం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని లారీ డ్రైవర్ మృతి
- వారానికి ఒక ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీరని విషాదం
- అడ్డూ అదుపు లేని భారీ వాహనాలు.. అధికారుల నిఘా ఏదీ?
- వే బ్రిడ్జిలు లారీ యూనియన్ కార్యాలయాలు రేక్ పాయింట్లతో పెరుగుతున్న రద్దీ
- చెక్‌పోస్టులు లేవు తనిఖీలు లేవు ప్రమాదాల నియంత్రణ చర్యలు శూన్యం ....?



**చింతకాని ఆగస్టు 23 విజన్ ఆంధ్ర.** ఖమ్మం బోనకల్లు రహదారిపై రామకృష్ణాపురం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ జానీపాషా 45 దుర్మరణం చెందాడు కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన జానీపాషా లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు రహదారిపై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు ప్రమాదానికి కారణమైన వాహనం అక్కడి నుంచి వెళ్లిపోవడంతో దాని ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు చేపట్టారు వాహనం వివరాలను సేకరించి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు ఈ ఘటనతో మరోసారి ఖమ్మం బోనకల్లు రహదారి భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో వరుస ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు మాత్రం తగిన భద్రతా చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి రహదారి వెంబడి వే బ్రిడ్జిలు లారీ యూనియన్ కార్యాలయాలు ఎరువులు ఇతర సామగ్రి లోడింగ్ జరిగే రేక్ పాయింట్లు ఉండటంతో భారీ లారీల రాకపోకలు మరింత పెరుగుతున్నాయని గ్రామస్తులు వాహనదారులు చెబుతున్నారు దీనికి తోడు ఆంధ్ర ప్రాంతం నుంచి నిత్యం పెద్ద సంఖ్యలో లారీలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుండటంతో రద్దీ మరింత పెరుగుతోందని అంటున్నారు కొన్ని సందర్భాల్లో భారీ వాహనాలు విపరీతమైన వేగంతో దూసుకెళ్తుండటంతో ఇతర వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారని చెబుతున్నారు గతంలో చింతకాని గ్రామానికి చెందిన ఓ యువకుడు ఇదే రహదారిపై జరిగిన ప్రమాదంలో మృతి చెందిన విషాదాన్ని ప్రజలు మరవకముందే ఇప్పుడు రామకృష్ణాపురం సమీపంలో జానీపాషా మృతి చెందడం ఆందోళన కలిగిస్తోంది రామకృష్ణాపురం నామవరం నాగులవంచ శివారు పందిళ్లపల్లి జగన్నాథపురం ప్రాంతాల్లో గతంలోనూ ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని స్థానికులు గుర్తుచేస్తున్నారు ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో ప్రాణనష్టం జరిగినా ప్రమాదకర పరిస్థితులను తొలగించే శాశ్వత చర్యలు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రమాదకర ప్రాంతాలను అధికారులు స్వయంగా గుర్తించి ప్రమాదాలకు కారణాలను పరిశీలించి అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు వాహనదారులు కుటుంబీకులు కోరుతున్నారు రోడ్డు రవాణా శాఖ అధికారులు పోలీసు శాఖకు చెందిన సంబంధిత అధికారులు సమన్వయంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను స్వయంగా పరిశీలించి గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు గుర్తించిన ప్రమాదకర ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర నిఘా కొనసాగించాలని కోరుతున్నారు వే బ్రిడ్జిల వద్ద నిలిపే లారీలపై నిఘా పెట్టడం లారీ యూనియన్ కార్యాలయాల వద్ద రద్దీని నియంత్రించడం రేక్ పాయింట్ల వద్ద లోడింగ్ అన్‌లోడింగ్ సమయంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని అంటున్నారు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై తనిఖీలు నిర్వహించడం అధిక వేగంతో ప్రయాణించే భారీ వాహనాలను నియంత్రించడం రాత్రివేళ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని చెబుతున్నారు ఒక్క ప్రమాదం ఒక కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తోందని ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తిని కోల్పోయిన కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో పడుతున్నాయని పిల్లలు తల్లిదండ్రులను కోల్పోతున్నారని కుటుంబాన్ని పోషించే వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం ఆర్థికంగా కూడా కుదేలవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఎన్నో కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి అనాథలవుతున్నా అధికారులు మాత్రం ప్రమాదాల నియంత్రణకు శాశ్వత చర్యలు చేపట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ప్రమాదం జరిగిన తర్వాత సంఘటనా స్థలానికి చేరుకోవడం కేసులు నమోదు చేయడం పరామర్శలు చేయడం వరకే పరిమితం కాకుండా ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వాహనదారులు అంటున్నారు ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలను అధికారులే గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు రోడ్డు రవాణా శాఖ అధికారులు పోలీసు శాఖ సంబంధిత అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అవసరమైన చోట చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి భారీ వాహనాల వేగాన్ని నియంత్రించాలని గ్రామస్తులు వాహనదారులు కుటుంబీకులు డిమాండ్ చేస్తున్నారు మరో ప్రాణం పోయేలోపు మరో కుటుంబం రోడ్డున పడేలోపు అధికారులు మేల్కొని ఖమ్మం బోనకల్లు రహదారిపై కఠినమైన భద్రతా చర్యలు చేపట్టి ప్రమాదాల పరంపరకు శాశ్వతంగా అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు

# గురువు కృషికి ఫలితం.. విద్యార్థులతో కళకళలాడుతున్న బడి!

**- 15 మంది నుంచి 77 మంది**

**- పిల్లిగుండ్ల బడి విజయగాథ!**

**- బడిని మార్చిన సంకల్పం.. విద్యార్థులను పెంచిన కృషి!**



**మర్పల్లి,ఆగస్టు 23 (విజన్ ఆంధ్ర):** ఒక ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రులకు నమ్మకం కల్పించాలంటే ఉపాధ్యాయుల చిత్తశుద్ధి, నిరంతర కృషి, సమాజ సహకారం ఎంతటి మార్పును తీసుకురాగలవో వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పిల్లిగుండ్ల ప్రాథమికోన్నత పాఠశాల నిరూపిస్తోంది. ఒకప్పుడు కేవలం 15 మంది విద్యార్థులతో మూతపడే స్థితిలో ఉన్న పాఠశాల.. నేడు ఏకంగా 77 మంది విద్యార్థులతో కళకళలాడుతోంది. 2024 జూన్‌లో పిల్లిగుండ్ల ప్రభుత్వ పాఠశాలలో కేవలం 15 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. అదే సమయంలో ప్రధానోపాధ్యాయుడిగా ఎం.డి. మోసిన్ బాధ్యతలు స్వీకరించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించాలనే సంకల్పంతో ఆయన ముందడుగు వేశారు. ప్రతి ఇంటికీ వెళ్లి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. పాఠశాలలో అందిస్తున్న విద్య, నిర్వహిస్తున్న కార్యక్రమాలు, విద్యార్థుల ప్రతిభను వారికి వివరించారు. దీంతో తొలుత 15 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య 25కు.. ఆపై 45కు.. 75కు చేరి ప్రస్తుతం 77 మందికి పెరిగింది.

### చదువుతో పాటు ప్రతిభకు ప్రాధాన్యం

విద్యార్థుల అభ్యసన ప్రగతితో పాటు వారి ప్రతిభను వెలికితీసేందుకు పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రతిభా ప్రదర్శనలు, తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం వంటి జాతీయ పర్వదినాలను ఘనంగా నిర్వహిస్తూ విద్యార్థుల ప్రతిభను గ్రామ ప్రజలకు పరిచయం చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రుల్లో నమ్మకం పెరిగింది. కొందరు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న తమ పిల్లలను సైతం



తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి దాతల సహకారాన్ని సమీకరించి పాఠశాలకు అవసరమైన సామగ్రిని అందించారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో అదనపు ఉపాధ్యాయులు కూడా కేటాయించబడ్డారు. ఉపాధ్యాయులంతా సమన్వయంతో పనిచేస్తూ పాఠశాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నారు.

### ప్రీ-ప్రైమరీతో మరో అడుగు

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలో ప్రీ-ప్రైమరీ విద్యను ప్రవేశపెట్టడంతో పాఠశాల అభివృద్ధికి మరింత బలం చేకూరింది. చిన్నారులను తొలిదశ నుంచే ప్రభుత్వ విద్య వైపు ఆకర్షించే అవకాశం ఏర్పడింది. ఎల్‌కేజీ, యూకేజీ పూర్తి చేసిన ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు పట్టాలు అందించే కార్యక్రమాన్ని మండల విద్యాధికారి, సర్పంచ్, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల స్థాయిలో నిర్వహించిన ఈ వినూత్న కార్యక్రమం గ్రామ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది.

### ఉపాధ్యాయుల కృషి అమోఘం: సర్పంచ్ ఆకుల పద్మ సంజీవ్ రెడ్డి

పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. మోసిన్‌తో పాటు ఉపాధ్యాయులు సుప్రియ, సుందర్, అనూష చేస్తున్న కృషి అభినందనీయమని గ్రామ సర్పంచ్ ఆకుల పద్మ సంజీవ్ రెడ్డి అన్నారు. 15 మంది ఉన్న విద్యార్థుల సంఖ్య 77కు చేరడం సాధారణ విషయం కాదని, ఉపాధ్యాయుల కృషి వల్లే ఇది సాధ్యమైందని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామం తరఫున తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

### ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు: ఎంఈఓ అశోక్

మండలంలో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందడం సంతోషకరమని ఎంఈఓ అశోక్ అన్నారు. పిల్లిగుండ్ల పాఠశాలలో ఉపాధ్యాయుల కృషితో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో పాటు వారి అభ్యసన స్థాయిలు కూడా మరింత మెరుగుపడాలని, ఇలాంటి పాఠశాలలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

### ప్రతి ఇంటి తలుపు తట్టిన సంకల్పం

"నేను పాఠశాలకు వచ్చినప్పుడు కేవలం 15 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పరిస్థితిని మార్చాలని సంకల్పించాను. ప్రతి ఇంటికీ వెళ్లి తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, సర్పంచ్, ఉపసర్పంచ్‌లతో మాట్లాడాను. పాఠశాలలో జరుగుతున్న మార్పులను తల్లిదండ్రుల సమావేశాల ద్వారా వారికి చూపించగలిగాం. మా స్టాఫ్ సుప్రియ, సుందర్, అనూషల సహకారం మరువలేనిది. అందరి సహకారం ఇలాగే కొనసాగితే పాఠశాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాను" అని ప్రధానోపాధ్యాయుడు ఎం.డి. మోసిన్ తెలిపారు. పిల్లిగుండ్ల ప్రభుత్వ పాఠశాల కథ కేవలం 15 నుంచి 77కు విద్యార్థుల సంఖ్య పెరిగిన కథ కాదు. ప్రభుత్వ విద్యపై కోల్పోయిన నమ్మకాన్ని తిరిగి తీసుకువచ్చిన కథ. ఒక గురువు సంకల్పం.. ఉపాధ్యాయుల సమష్టి కృషి.. గ్రామ ప్రజల సహకారం కలిస్తే ప్రభుత్వ పాఠశాలలు కూడా అద్భుత విజయాలను సాధించగలవని ఈ పాఠశాల చాటిచెబుతోంది.

# తలసేమియా బాధితులకు అండగా మిలాద్ కమిటీ

**- 5వ మిలాద్ రక్తదాన శిబిరంలో 44 యూనిట్ల రక్త సేకరణ**

**పరిగి, ఆగస్టు 23 (విజన్ ఆంధ్ర):** మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పరిగి మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ మిలాద్ రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆదివారం కుతుబ్ షాహీ జామా మసీదు పక్కన ఉన్న ఆశుర్ఖానాలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న చిన్నారులు, ఇతర రోగులకు రక్తం అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో స్థానిక యువత, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని 44 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. రక్తదానం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని నిర్వాహకులు తెలిపారు. మిలాద్ కమిటీ సదర్ ఖాజీ ఖాజా అజారుద్దీన్ ఖాద్రీ పర్యవేక్షణలో శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రక్తానికి కుల, మత, లింగ భేదాలు ఉండవని, ఆపదలో ఉన్న వ్యక్తి ప్రాణాలను కాపాడటమే రక్తదానం లక్ష్యమని పేర్కొన్నారు. మానవాళికి మనిషి అందించగలిగే అత్యుత్తమ బహుమతుల్లో రక్తదానం ఒకటని తెలిపారు. శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ మిలాద్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. తలసేమియా బాధితులకు అండగా నిలిచిన దాతలను అభినందించారు.



# విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి పైలెట్ రోహిత్ రెడ్డికి ఆహ్వానం



**తాండూరు ఆగస్టు 23 (విజన్‌ఆంధ్ర)** తాండూరు నియోజకవర్గం బషీరాబాద్ మండలం నావాంద్గీ గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు, ముఖ్య నాయకులు మణికొండలోని తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి ని హైదరాబాద్ మణికొండ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించనున్న శ్రీఆంజనేయ స్వామి, శివ నంది, మైసమ్మ, ధ్వజస్తంభం, నవగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై, స్వామివారి ఆశీస్సులు పొందాలని పైలెట్ రోహిత్ రెడ్డి గారిని ఆహ్వానించారు. గ్రామస్తుల ఆహ్వానాన్ని సాదరంగా స్వీకరించిన పైలెట్ రోహిత్ రెడ్డి గారు సానుకూలంగా స్పందించారు. గ్రామంలో ఆధ్యాత్మిక కార్యక్రమం ఘనంగా, విజయవంతంగా జరగాలని ఆకాంక్షిస్తూ, తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రతినిధులు పైలెట్ రోహిత్ రెడ్డి కు ధన్యవాదాలు తెలిపారు.

# అన్నాచెల్లెళ్ల అక్క తమ్ముళ్ల ఆప్యాయత అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ

**- రక్షాబంధన్ వేడుకల్లో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి**





**తాండూరు ఆగస్టు 23 (విజన్ ఆంధ్ర)** అన్నాచెల్లెళ్ల అక్క తమ్ముళ్ల ఆప్యాయత అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలోని మల్ రెడ్డి పల్లిలో గల రాజయోగ కేంద్రంలో బ్రహ్మకుమారీ సమాజం వారి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రక్షాబంధన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీ సోదరీమణులు ఎమ్మెల్యే రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సమాజంలో సోదరభావం, మానవతా విలువలు మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీ సమాజం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కల సహకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

## - తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి
## - ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**తాండూరు ఆగస్టు 23 (విజన్ ఆంధ్ర)** కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కల సహకారం చేస్తుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం యాలాల్ మండలం దుబ్బతండా లో శాంతి భాయ్ హరిచందర్ మరియు అనిత బాలు నాయక్ గార్లు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ళు, దేవనూర్ గ్రామంలో ఉమామహేశ్వరి మోనచారి గార్లు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు, అక్కంపల్లి గ్రామంలో బుడిగేజంగం మంగమ్మ సందీప్ గార్లు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల





గృహప్రవేశ పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలిపారు. తమ సొంతింటి కళను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు ఉన్నారు.

# ఆంజనేయ స్వామి ఆలయానికి రూ.25 వేల విరాళం

## - ధ్వజస్తంభ ప్రతిష్ఠా వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి

**పరిగి, ఆగస్టు 23(విజన్ ఆంధ్ర):** పరిగి నియోజకవర్గ పరిధిలోని దోమ మండలం ఉదాన్‌రావుపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి సీనియర్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ కొప్పుల నాగిరెడ్డితో కలిసి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు



నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు, భక్తులు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్ రెడ్డి, బోయిని లక్ష్మయ్య, రాజగోపాల్ చారి, రాజిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలి

## - సిఐటియు నాయకులు కే శ్రీనివాస్ డిమాండ్

తాండూరు,ఆగస్టు 23 (విజన్ ఆంధ్ర) తాండూరులో జూనియర్ కళాశాల లెక్చరర్ ఇంటర్ విద్యార్థినిని మాయమాటలతో లోబరుచుకుని, వాట్సాప్ ద్వారా చాటింగ్ చేస్తూ లైంగిక వేధింపులకు పాల్పడిన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థినిని వేధించిన లెక్చరర్‌పై తక్షణమే పోక్సో చట్టం కింద కేసు



నమోదు చేసి అరెస్ట్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కే. శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బాధ్యుడైన అధ్యాపకుడిని కాపాడేందుకు కొందరు రాజకీయ అండదండలతో మధ్యవర్తుల ద్వారా పెద్ద మొత్తంలో డబ్బులు చేతులు మార్చి రాజీ ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. విషయం బయటకు రాకుండా నడిపిన ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులైన లెక్చరర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేదంటే విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలతో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

# పరిగి బస్టాండ్‌లో పిక్‌పాకెటింగ్‌పై అప్రమత్తంగా ఉండాలి

## - ప్రయాణికులకు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి సూచన



**పరిగి, ఆగస్టు 23(విజన్ ఆంధ్ర):** పరిగి బస్టాండ్‌లో పిక్‌పాకెటింగ్, దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని పరిగి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుండెపల్లి రామకృష్ణారెడ్డి సూచించారు. బస్టాండ్‌లో రద్దీగా ఉండే సమయాల్లో దొంగలు ప్రయాణికులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన కోరారు. ప్రయాణ సమయంలో సెల్‌ఫోన్లు, విలువైన బంగారు నగలు, నగదు, ఇతర వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. పర్సులు, బ్యాగులను వెనుక వైపు కాకుండా ముందువైపు పెట్టుకుని అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. రద్దీ ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తులతో అనవసరంగా మాట్లాడకుండా తమ వస్తువులపై దృష్టి పెట్టాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, అనుమానాస్పద కదలికలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని రామకృష్ణారెడ్డి సూచించారు. ప్రజలు తమ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండటమే పిక్‌పాకెటింగ్, దొంగతనాలను అరికట్టేందుకు ముఖ్యమైన మార్గమని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, మిత్రులు, పరిగి ప్రజలు ఈ సూచనలను పాటించి ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# టిపిసిసి మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ ఖలేద్ సైఫుల్లాకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు



**తాండూరు ఆగస్టు 23 (విజన్ ఆంధ్ర)** టిపిసిసి మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ గా నియామకమైన ఖలేద్ సైఫుల్లా కు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. తాండూరు పట్టణానికి చెందిన మైనారిటీ నాయకులు ఖలేద్ సైఫుల్లా టి పి సి సి మైనార్టీ రాష్ట్ర కన్వీనర్ గా నియామకమైన సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఖలేద్ సైఫుల్లా కు శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో మైనారిటల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజు, నాయకులు ఆమెర్ అబ్దుల్లా, హాబీబ్ లాల, తదితరులు ఉన్నారు.